క్లుప్తంగా

రేపు మండల సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10–30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రైతు సంఘానికి డ్రోన్ అందజేత



డ్రోన్‌ను అందజేస్తున్న వ్యవసాయాధికారులు, బ్యాంకు మేనేజర్

చాపాడు: మండలంలోని రేపల్లె గ్రామానికి చెందిన శ్రీ దస్తగిరి స్వామి రైతుమిత్ర కిసాన్ డ్రోన్ కష్టమ్ హైరింగ్ సెంటర్ సభ్యులకు శుక్రవారం డ్రోన్ యంత్రాన్ని అందజేశారు. దీని విలువ రూ.9.8లక్షలు కాగా ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో రైతు సంఘాలకు పంపిణీ చేసిందని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమూర్తి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమణ, ఏఈఓ స్వప్న, డ్రోన్ కంపెనీ ప్రతినిధులు వంశీ, మీరా తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం



దోమల నివారణ కోసం ప్రజలకు సూచనలు ఇస్తున్న డాక్టర్ మధుకుమార్

ప్రొద్దుటూరు క్రైం : ప్రజలు ప్రతి శుక్రవారం నిల్వ ఉన్న నీటిని పారబోసి, డ్రైడే పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ మధుకుమార్ తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డ్రైవర్ కొట్టాలు సచివాలయ పరిధిలో దోమల నివారణ కోసం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ ప్రతి వారానికి ఒక సారి అయినా ఇంటిలో వివిధ పాత్రల్లో ఉన్న నీటిని పారపోసి పాత్రలు పూర్తిగా ఆరబెట్టిన తర్వాత తిరిగి నీటిని నింపుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్తకుండీలు, పాత డ్రమ్ములు, కుండీలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల అక్కడ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఫణీంద్రప్రసాద్

కాశినాయన : మండలంలోని మూలపల్లె ఎంపీపీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులకు, కేఎన్ కొట్టాల ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు మాజీ ఎంఎల్‌ఓ ఫణీంద్రప్రసాద్ శుక్రవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫణీంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల: మండలంలోని మద్దిమాను గురప్ప స్వామి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈఓ నరసయ్య, ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో హుండీ లెక్కించగా రూ. 6,16,387 నగదు, 180 గ్రాముల బంగారు, 14 కేజీల వెండి వచ్చినట్లు ఈఓ నరసయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో గ్రామపెద్దలు మల్లికార్జునరెడ్డి, సుబ్బారాయుడు, సురేష్‌రెడ్డి, కొండయ్య, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగం మరువలేనిది

పోరుమామిళ్ల: కార్గిల్‌లో వీరులు త్యాగాలు మరువలేనివని కెప్టెన్ నవరం రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్లలోని మాజీ సైనికుల కార్యాలయం వద్ద శనివారం కార్గిల్ విజయ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. కార్గిల్ విజయ దివస్‌తో పాటు, నూతన కమిటీ, సమస్యలు చర్చిస్తామని, అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నమ్మించి మోసం చేయడమే బాబు నైజం



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- కూటమి బూటకపు హామీలను ఇంటింటికీ చెప్పాలి
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మేనిఫెస్టోను నమ్మి ఓటేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, నమ్మించి మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని టీఎస్ఆర్ కల్యాణమండపంలో ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి శుక్రవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచారని, నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటాయని వివరించారు. ఉద్యోగులను పూర్తిగా విస్మరించారని తెలిపారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన, తక్కువ ధరలతో మద్యం అందిస్తామని చెప్పిన బాబు ప్రైవేట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలను విచ్చలవిడి చేశారని మండిపడ్డారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందని వివరించారు.

రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదు

ప్రజా సమస్యలు, వారి అవసరాలకు సంబంధించి మాట్లాడితే కేసులు నమోదు చేస్తున్నారని రాచమల్లు తెలిపారు. రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం లేదన్నారు. చంద్రబాబు పాలన చూస్తుంటే నాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ రోజులు గుర్తొస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ప్రజల పక్షాన నిలిచి, కూటమి ప్రభుత్వ విధానాలను గట్టిగా ఎండగడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా తనపై కేసులు పెట్టి జైలుకు పంపించాలని సీఎం చంద్రబాబు కూటమి నాయకులను పిలిపించుకొని స్వయంగా చెప్పినట్లు రాచమల్లు తెలిపారు. తనపై అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపినా తమ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలపై రవ్వంత ప్రేమ కూడా తగ్గదన్నారు. జగనన్న అంటే ప్రాణమిచ్చే తానపై కేసులు పెట్టినా బెదిరేదిలేదని రాచమల్లు చెప్పారు.

ఐకమత్యమే శ్రీరామరక్ష

రానున్న రోజుల్లో ఏం జరిగినా కార్యకర్తలందరం ఐక్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగట్టాలని చెప్పారు. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను నేటి చంద్రబాబు పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని రాచమల్లు తెలిపారు. వచ్చేది మన ప్రభుత్వమేనని కార్యకర్తలందరూ ధైర్యంగా, ఉత్సాహంగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ఎవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 15 గ్రామ సర్పంచ్‌లు, 24 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానాలను మనం కైవసం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోకు సంబంధించిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, మండల పార్టీ కన్వీనర్ మార్తల ఓబులరెడ్డి, మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన 'కూటమి'



ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

అట్లూరు : ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంతో పాటు ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో ఏ ఒక్క వర్గానికైనా మేలు జరిగిందా అని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ పథకాలు కనుగరుగయ్యాయని, హామీలు తుడిచిపెట్టుకుపోయాయని, పాలనలోకి వచ్చి రెండో ఏడాది జరుగుతున్నా రైతుభరోసా గమ్యం లేకుండా పోయిందన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు వచ్చాయంటూ అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కొన్ని మీడియా సంస్థలు ఈ అసత్యాలను వాస్తవాలుగా చూపుతున్నాయన్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఏ ఒక్క వర్గానికి మేలు జరిగినట్లు కనిపించడం లేదన్నారు. ప్రజల సమస్యలను విస్మరించి లిక్కర్ స్కామ్‌లు, అక్రమ కేసుల ద్వారా దృష్టి మరల్చే ప్రయత్నాలు చేస్తున్నారని, రాష్ట్రంలో లా అండ్ అర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని విమర్శించారు. మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీసు అధికారులు కూడా స్పందించే పరిస్థితి లేదని తెలిపారు.

తల్లికి వందనం కాదు.. తల్లికి వంచన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత తల్లికి వందనం పథకాన్ని అందించారని, ఈ మొత్తాన్ని పూర్తి స్థాయిలో జమ చేయలేదని చెప్పారు. ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసిన లక్షలాది మంది విద్యార్థులకు తల్లికి వందనం రాకపోవడంతో వారు నష్టపోయారని, వారికి ఈ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను గత ప్రభుత్వం బలోపేతం చేయగా ఇప్పుడు వాటిని అభివృద్ధి చేయడంలో అలసత్వం చూపుతుందన్నారు. మెగా డీఎస్సీ హామీ ఇంకా నెరవేర్చలేదన్నారు. గత 14 నెలలుగా కొత్తగా ఏ ఒక్క ఇంటి నిర్మాణం జరగలేదని, ఎవరికి పైసా బిల్లు చెల్లించలేదన్నారు. అభివృద్ధి అనే మాట రాష్ట్రంలో ఏ మూలాన నుండి వినిపించడం లేదన్నారు. ఆడబిడ్డ పథకం ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.1500 ఇవ్వాలని చెప్పిన మంత్రి ఆ మొత్తం ఇచ్చేందుకు రాష్ట్రాన్ని అమ్ముకోవాలంటూ చెప్పిన వాఖ్యలు బాధాకరమన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 50 ఏళ్లకు పింఛన్ ఇచ్చే హామీని విస్మరించారని, రెండవ ఖరీఫ్ ముగుస్తున్నా రైతుభరోసాపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని విమర్శించారు.

పద్మశాలీయ సంఘం సేవలు అభినందనీయం



విద్యార్థులతో పద్మశాలీయ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పద్మశాలీయ అభ్యుదయ సంఘం సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో శుక్రవారం పద్మశాలీయ అభ్యుదయం సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 13 ఏళ్లుగా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి అందించడం అభినందనీయమన్నారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 27 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందించడంతో పాటు చలివేంద్రాల ఏర్పాటు, ఉచిత వైద్యశిబిరాలు, వనభోజనాలు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 30 మున్సిపల్, ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 1,760 మంది 10వ తరగతి విద్యార్థులకు రూ.5.25లక్షల విలువ చేసే మ్యాథ్స్, సోషియల్, ఫిజిక్స్, బయాలజీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సాధు అశోక్, చెన్నా వెంకట చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, కోశాధికారి అవ్వారు శ్రీనివాసులు, సంఘం ప్రతినిధులు నందం కుమార్, జింకా సుబ్రహ్మణ్యం, కోటా సంజీవకుమార్, జింకా శ్రీనివాసులు, భోగా ఆనంద్, వెంకట రమణ, మునిస్వామి, శింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన కుటుంబ నియంత్రణ

- కు.ని ఆపరేషన్లకు బ్రేక్
- విధిలేక ప్రైవేట్ వైపు మొగ్గు
- పేదలపై తప్పని ఆర్థిక భారం



మూసిన పీపీ యూనిట్ ఆపరేషన్ థియేటర్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను అధికారులు పక్కన పట్టేశారు. సుమారు ఐదు నెలల నుంచి ఒక్క ట్యూబెక్టమీ ఆపరేషన్ కూడా జరగలేదు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న పీపీ యూనిట్‌కు సంబంధించిన ఆపరేషన్ థియేటర్‌కు తాళం వేశారు. పీపీ యూనిట్‌లో ప్రతి రోజు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిగేవి. నెలకు 50–60 ఆపరేషన్లు చేసేవారు. ప్రొద్దుటూరు పరిసర ప్రాంత ప్రజలతో పాటు, కమలాపురం, మైదుకూరు, కొండాపురం, పులివెందుల, నంద్యాల జిల్లా నుంచి మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు ఇక్కడికి వచ్చేవారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి ఆపరేషన్లు పూర్తిగా ఆగిపోయాయి. గతంలో ఇక్కడ పీపీ యూనిట్ డాక్టర్‌గా పని చేస్తున్న ఇళయరాణి శస్త్రచికిత్సలు చేసేవారు. ఆమె ఉన్నప్పుడు ప్రతి రోజు ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరిగేవి. అయితే పలు కారణాలతో ఫిబ్రవరి నెలలో ఉన్నతాధికారులు డాక్టర్‌ను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి ఒక్క ఆపరేషన్ కూడా జరగలేదు. ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. దీంతో పేదలు, మధ్య తరగతి ప్రజలు కడప, చెన్నూరు, జమ్మలమడుగు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆపరేషన్ కోసం రెండు, మూడు సార్లు తిరగాల్సి రావడంతో చాలా మంది రూ.20–25 వేలు వెచ్చించి ప్రైవేట్ హాస్పిటల్స్‌లో శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. ప్రొద్దుటూరు పీపీ యూనిట్‌లో ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మురళీకృష్ణను సన్మానిస్తున్న సంఘం నాయకులు

అట్లూరు : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం సిద్దవటం తాలూకా యూనిట్ అధ్యక్షుడు సి.మురళీకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం సిద్దవటం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సి.మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సిద్దవటంలో ఎన్నికల అధికారిగా ఎం.ఎ.ప్రసాద్‌గౌడ్, కడప సిటీ అధ్యక్షుడు సి.నాగరాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మురళీకృష్ణను సన్మానించారు.

ఘన నివాళి



చిన్న సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మైదుకూరు (చాపాడు): మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లె శివరాం యాదవ్ తండ్రి, మాజీ సర్పంచ్ నేట్లపల్లె చిన్న సుబ్బయ్య యాదవ్ (101) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యంతో చైన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి గ్రామానికి చెందిన చిన్న సుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం నేట్లపల్లె శివరాం యాదవ్, ఆయన సోదరుడు రామాంజనేయుడు యాదవ్‌లను రఘురామిరెడ్డి, రామగోవిందరెడ్డి, రెడ్యం పరామర్శించి ఓదార్చారు. శివరాం యాదవ్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మిక సంఘాల నాయకులు

చాపాడు: రాష్ట్రంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, 2022 పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలనే డిమాండ్‌తో ఆగష్టు నెల 7న తలపెట్టనున్న చలో విద్యుత్ సౌధా విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.రామలింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం వచ్చే నెల 7న చేపట్టనున్న చలో విజయవాడ విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మాదిరి ఏపీలో కూడా కోటి రూపాయల ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలన్నారు. గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్ కార్మికులకు పీఆర్సీ అరియర్స్ ఇవ్వాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, యూఈఈయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్, యూఈసీడబ్ల్యూ మైదుకూరు డివిజన్ కార్యదర్శి పీసీ కొండయ్య, యూనియన్ నాయకులు రవీంద్రనాథ్, జయరాముడు, ప్రతాప్ రెడ్డి, కార్మికులు వేణుగోపాల్, వేణు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



అట్లూరు: ఘన జీవామృతాన్ని తయారు చేయిస్తున్న వ్యవసాయాధికారులు



మైదుకూరు(చాపాడు): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఏడీఏ వెంకటసుబ్బయ్య తెలిపారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు, అట్లూరు, గోపవరం, సిద్దవటం మండలాలకు సంబంధించి వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం బద్వేలు మండలం పుట్టాయపల్లె, అబ్బుసాహెబ్‌పేట గ్రామాల్లో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎండీఎస్ మోడల్ చూపించడం, ఏటీఎం మోడల్ ప్రదర్శించడం, ఎన్‌పీఎం షాపు సందర్శన చేయడం జరిగింది. బీజామృతం, సీడ్ పెలిట్రైజేషన్, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం సామూహికంగా తయారు చేసి కావాల్సిన పదార్థాలు, ఉపయోగాల గురించి ఏడీఏ వెంకటసుబ్బయ్య వివరించారు. ఆయా మండలాల వ్యవసాయాధికారులు అరుణ, విజయరావు, రామకృష్ణయ్య, రైతుసేవాకేంద్రం సిబ్బంది పవన్‌కుమార్, సిద్దారెడ్డి, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలు, మహిళా రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు(చాపాడు): మైదుకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం సిబ్బందికి శుక్రవారం రెండో రోజు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ ఏడీఏ కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని ఆదిరెడ్డిపల్లె యూనిట్ పరిధిలోని ఓబయ్య పొలం వద్ద ఘన జీవామృతం, విత్తన గుళికలు, నీమాస్త్రం తయారు చేసి వాటి ఉపయోగాలను పకృతి వ్యవసాయ సిబ్బందికి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ ఎంటీ కృష్ణారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆటోలను ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా శుక్రవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లందరూ యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు సంబంధిత రికార్డులను ఆటోలో పెట్టుకోవాలని సూచించారు. పీసీ నెంబర్లను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. ఆటోలో డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.


గురువులు గైర్హాజరు.. విద్యార్థులకు తిప్పలు

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె ఎంపీపీ పాఠశాల, వరికుంట్లలోని ఎంపీపీ పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా పనిచేస్తున్నాయి. శుక్రవారం ఈ రెండు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు అనివార్య కారణాల వలన గైర్హాజరయ్యారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఎంఈఓ నిర్మల దృష్టికి తీసుకెళ్లారు. వరికుంట్ల ఎస్సీ కాలనీ పాఠశాలకు అక్కడే ఉన్న యూపీ పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని వెళ్లమని చెప్పారు. ఆయన అక్కడికి వెళ్లలేదు. సీఆర్పీ రవిని వరికుంట్ల పాఠశాలకు పంపించారు. అయితే నాయునిపల్లె పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో వారు కూడా విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి సీఆర్పీని రవిని నాయునిపల్లె పాఠశాలకు పంపించారు. యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు వరికుంట పాఠశాలకు వస్తారని, మీరు నాయునిపల్లెకు వెళ్లాలని సీఆర్పీ రవికి చెప్పారు. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై ఎంఈఓ నిర్మలను వివరణ కోరగా వరికుంట్ల ఎస్సీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఒక రోజు సెలవు పెట్టి ఆస్పత్రికి వెళ్లగా, అక్కడ అతనికి వైద్యులు వెంటనే చికిత్స చేయాలని చెప్పడంతో ఆ ఉపాధ్యాయుడు గైర్హాజరయ్యారని తెలిపారు. నాయునిపల్లె ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు సెలవులో వెళ్లారని చెప్పారు. ఇక మీద ఎటువంటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఎంఈఓ పేర్కొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

కడప ఎడ్యుకేషన్: మత్తు పదార్థాల వల్ల విద్యార్థులు తమ భవిషత్తును అంధకారం చేసుకోవద్దని ఈగల్ టీం అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం కడప గాంధీ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ।ఈగల్‌॥ టీం ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించాను. ఈ సందర్భంగా ఈగల్‌టీమ్ అధికారులు మాట్లాడుతూ కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారన్నారు.

కేసీ కెనాల్ నీటి సమస్యకు పరిష్కారం



కాలువలో జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని కేసీ కెనాల్ నీటి సమస్యను శుక్రవారం పరిష్కరించినట్లు కేసీ కెనాల్ ఏఈ గురుశేఖర్‌రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల క్రితం నుంచి చాపాడు ప్రధాన కాలువ నుంచి ఒకటో నంబరు కాలువ ద్వారా వచ్చే నీరు కల్వర్టు నుంచి వెళ్లేందుకు వీల్లేక చాపాడులో ఇళ్ల చెట్టూరు నీరు చేరింది. దీంతో రైతులతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో స్థానిక నాయకులు ఫిర్యాదు మేరకూ శుక్రవారం కేసీ కెనాల్ ఏఈ గురుశేఖర్‌రెడ్డి జేసీబీని తెప్పించి కల్వర్టులో పేరుకుపోయిన వ్యర్థాలు, జంబును తొలగించారు. దీంతో కాలువలో కేసీ నీరు సాఫీగా పారుతోంది. వచ్చే వేసవి కాలంలో కల్వర్టు నిర్మాణం చేపట్టి ఈ సమస్య పునరావృతంగా కాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్బర్, హర్షవర్ధన్‌రెడ్డి, సలీం, మస్తాన్ పాల్గొన్నారు.

తారస్థాయికి కూటమి కక్ష సాధింపులు

- హామీలు అమలులో చంద్రబాబు విఫలం
- కట్టుకథలు అల్లి ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారు
- మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు(చాపాడు): ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో దారుణం విఫలమైన కూటమి ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మరల్చేందుకు చేపడుతున్న కక్ష సాధింపు చర్యలు తారస్థాయికి చేరాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. తప్పుడు కేసులు పెట్టినా.. కక్ష సాధింపుకు పాల్పడినా బెదిరేదని స్పష్టం చేశారు. మైదుకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఈయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ 14 నెలల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. తాను ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే.. కొందరు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

యూరియా, ఎరువుల కొరత

టీడీపీ పరిపాలనలో రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు, జీలుగలు, విత్తనాలు అందడం లేదని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి బ్రాందీషాపుల వద్ద మద్యం దొరకుతుందని, ప్రతి పల్లెలో ఐదారు బెల్టుషాపులతో మద్యం ఏరులైనా పారుతోందన్నారు. 14 నెలల్లో సీఎం చంద్రబాబు రూ.1.80 లక్షల కోట్లు అప్పులు చేశారని, సంక్షేమ పథకాలు అమలు చేయలేదని, కనీసం రైతులకు గిట్టుబాటు కల్పించలేదని, పెట్టుబడి సాయం అందించలేదని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికి ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని, ఇప్పుడు ఈ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వాఖ్యలు సిగ్గు చేటన్నారు. లిక్కర్ స్కాం అంటూ కట్టు కథలు అల్లి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని, ఇప్పటికే సీఎం చంద్రబాబు తీరు వలన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు పోస్టింగ్‌లు లేకుండా ఉన్నారని, వీరి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి శూన్యం

మైదుకూరు మున్సిపాలిటీలో ఎక్కడైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్ జెడ్పీ వేలం పాటలో అధిక ధరకు దక్కించుకున్న షాపులకు నోటీసులు ఇవ్వడం ఎంత వరకూ సమంజసమని నిలదీశారు. మైదుకూరు ఈ షాపు ఒక్కటే రోడ్డుపైకి ఉందా.. మిగిలిన షాపులు కన్పించలేదా..ఇదంతా కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రజల తరపున పోరాటాలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మాబుషరీఫ్, కోఆప్షన్ మెంబరు ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.